సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం ¦ 9 ¦ నవంబర్ ¦ 2024



టన్ను చీనీ రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు, కనిష్టంగా రూ.14 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.23

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.23, కనిష్టంగా రూ.10, సరాసరిన రూ.16 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.4°/16.6°

జిల్లా పరిధిలో శుక్రవారం పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

క్వింటా ఎండుమిర్చి రూ.14 వేలు



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా ఎండుమిర్చి గరిష్టంగా రూ.14 వేలు పలికింది. శుక్రవారం మార్కెట్‌కు 332 మంది రైతులు 485.50 క్వింటాళ్ల ఎండుమిర్చి తీసుకొచ్చినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మొదటిరకం ఎండుమిర్చి క్వింటా రూ.14 వేలు, రెండో రకం క్వింటా రూ.9 వేలు, మూడో రకం ఎండు మిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం పలికింది.

పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ సేవలు సద్వినియోగం చేసుకోండి

హిందూపురం: తపాలాశాఖ ప్రవేశపెట్టిన ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)లో సేవలు సద్వినియోగం చేసుకోవాలని హిందూపురం డివిజన్ పోస్టల్ సూపరిటెండెంట్ యు.విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... పోస్టల్ పేమెంట్ బ్యాంక్ సేవలను వివరించారు. జాతీయ, ప్రాంతీయ బ్యాంకులతో సమానంగా ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంకులలో అర్హులైన వారికి ఆర్థిక సాధికారత, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే అవకాశాలుంటాయన్నారు. జిల్లాలోని 472 పోస్టాఫీసుల్లో బ్యాంక్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఆసక్తి ఉన్న వారు ఆయా పోస్టాఫీసుల్లో ఖాతాలు తెరవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఖాతాలను పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆధార్ లింకేజ్ సులభతరం చేయడానికి ఈ నెల 15 నుంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని సచివాలయ పరిధిల్లో తపాలా శాఖ ద్వారా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు.


చోళమాంబదేవికి పూజలు



అలంకరణలో చోళమాంబదేవి

అమరాపురం: స్థానిక కోట వీధిలో వెలసిన గ్రామదేవత చోళమాంబదేవికి భక్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి దీపాలంకరణ, కుంకుమార్చన, వివిధ రకాల అభిషేకాలను చేపట్టారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

టమాటకు బీమా ప్రీమియం చెల్లించండి



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో రబీలో టమాట పంట సాగు చేసిన రైతులు బీమా పరిధిలోకి రావాలంటే తమ వాటా కింద ప్రీమియం చెల్లించాలని ఉద్యానశాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రబీలో ఉద్యాన పంటలకు సంబంధించి వాతావరణ బీమా కింద టమాటను నోటిఫై చేశారన్నారు. టమాట సాగు చేసిన రైతులు ఈ–క్రాప్ నమోదుతో పాటు ఎకరాకు రూ.1,600 ప్రకారం డిసెంబర్ 15 లోపు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కామన్ సర్వీసు సెంటర్ (సీఎస్‌సీ), ఆర్‌ఎస్‌కేల్లో సంప్రదించి 1-బీ, ఆధార్, బ్యాంకు అకౌంట్, పంట ధ్రువీకరణ పత్రాలు అందించి ప్రీమియం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.32 వేల ప్రకారం బీమా వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఉద్యానశాఖ అధికారులు లేదా బీమా పథకం అమలు చేసే అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ జిల్లా మేనేజర్ కేవీ కృష్ణసాగర్ (9912275799)ను సంప్రదించాలన్నారు.

ఎంబీసీకి మంగళం!

జిల్లాలో పూర్తిగా వెనుకబడిన మడకశిర నియోజకవర్గంలో అన్ని చెరువులకూ కృష్ణా జలాలు అందించి రైతులను ఆదుకోవడానికి వీలుగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా మడకశిర బైపాస్ కెనాల్ నిర్మించేలా చర్యలు చేపట్టింది. రూ.214.85 కోట్లు మంజూరు చేసి టెండర్లను కూడా పూర్తి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎంబీసీకి మంగళం పాడేందుకు ప్రయత్నిస్తోంది. ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని విస్మరించి ఇక్కడి రైతులకు అన్యాయం చేస్తున్నారన్న విమర్శలున్నాయి.

- వైఎస్ జగన్ హయాంలో మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి రూ.214.85 కోట్లు మంజూరు
- టెండర్లు కూడా పూర్తి
- ఎంబీసీ పనులను అటకెక్కించిన కూటమి సర్కార్!
- హంద్రీనీవా కాలువ స్థాయిని పెంచేందుకు యత్నం
- గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే రైతులకు అన్యాయం



అగళి వద్ద నిరుపయోగంగా ఉన్న హంద్రీనీవా కాలువ

మడకశిర: హంద్రీనీవా మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణాన్ని కూటమి సర్కార్ అటకెక్కించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కూటమి సర్కార్ తీసుకుంటున్న ఈ నిర్ణయం మడకశిర నియోజకవర్గంలోని రైతులకు శాపంగా మారనుంది. వ్యవసాయ భూములన్నీ బీడుగా మారే పరిస్థితి ఏర్పడనుంది. గత ప్రభుత్వంలో ఎంతో కష్టపడి సాధించుకున్న ఈ బైపాస్ కెనాల్ నిర్మాణాన్ని కూటమి సర్కార్ మంగళం పాడటం అన్యాయమని రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

120 కిలో మీటర్లు దాటి...

మడకశిర నియోజకవర్గంలో వందలాది చెరువులు ఉన్నాయి. ఈ చెరువులకు పూర్తి స్థాయిలో కృష్ణా జలాలు అందడం లేదు. ప్రస్తుతం మడకశిర ప్రాంతానికి కృష్ణా జలాలు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చుట్టేసుకుని రావాలి. దాదాపు 120 కిలోమీటర్లు చుట్టేసుకుని మడకశిర నియోజకవర్గానికి కృష్ణా జలాలు చేరాలంటే చాలా కష్టం. ప్రస్తుతం గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పెనుకొండ, సోమందేపల్లి, గోరంట్ల, చిలమత్తూరు, లేపాక్షి, హిందూపురం, పరిగి మీదుగా కృష్ణా జలాలు మడకశిర నియోజకవర్గంలోకి ప్రవేశిస్తాయి. ఇలా చుట్టేసుకుని మడకశిరకు కృష్ణా జలాలు చేరడానికి దాదాపు 10 రోజులు పడుతుంది. ప్రతి ఏడాది మడకశిర ప్రాంతానికి 15 రోజులకన్నా కృష్ణా జలాలను విడుదల చేసే అవకాశం ఉండదు. ఇలాంటి పరిస్థితిలో కృష్ణా జలాలు మడకశిర నియోజకవర్గంలోకి ప్రవేశించడానికే 10 రోజులు అవుతుంది. మిగిలిన 5 రోజుల్లో రెండు లేదా మూడు చెరువులను నింపడానికే కష్టతరంగా మారుతోంది.

బైపాస్ కెనాల్ నిర్మిస్తే 33 కిలో మీటర్లే..

మడకశిర నియోజకవర్గానికి ఆలస్యం జరగకుండా కృష్ణా జలాలను అందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ఉన్నప్పుడు బైపాస్ కెనాల్‌ను రూపొందించారు. కెనాల్ పూర్తయితే నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలు అందించడానికి అవకాశం ఏర్పడేది. మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి మండలాలకు పూర్తిస్థాయిలో కృష్ణా జలాలు పారుతాయి. పెనుకొండ నుంచి నేరుగా మడకశిరకు కృష్ణా జలాలను తీసుకెళ్లడానికి వీలుగా గత ప్రభుత్వం బైపాస్ కెనాల్ నిర్మించడానికి నిర్ణయం తీసుకుంది. కేవలం 33 కిలోమీటర్ల పొడవుతో బైపాస్ కెనాల్ నిర్మాణంతో మడకశిరకు కృష్ణా జలాలు చేరుతాయి. అంటే 90 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసిన వెంటనే రెండు రోజుల్లోనే మడకశిర ప్రాంతానికి కృష్ణాజలాలు చేరే విధంగా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

రూ.214.85 కోట్లు మంజూరు చేసిన జగన్

బైపాస్ కెనాల్ నిర్మాణ అంశాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ కేబినెట్‌లో పెట్టి ఆమోదించారు. డీపీఆర్‌ను కూడా ప్రభుత్వం ఆమోదించింది. వెంటనే రూ.214.85 కోట్లు నిధులను కూడా మంజూరు చేసింది. న్యాయ సమీక్షలో కూడా కెనాల్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ లభించింది. టెండర్లను కూడా పూర్తి చేశారు. పనులు ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతుండగా ఎన్నికలు వచ్చాయి. ప్రస్తుత ప్రభుత్వం పనులు ప్రారంభించడానికి ఎలాంటి ఆటంకాలు కూడా లేవు. అయితే కూటమి సర్కార్ బైపాస్ కెనాల్ నిర్మాణానికి స్వస్తి పలికినట్లు ప్రచారం జరుగుతుండడంతో రైతుల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది.

కాలువ స్థాయి పెంచేందుకు యత్నం?..

బైపాస్ కెనాల్ నిర్మిస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతో కూటమి ప్రభుత్వం బైపాస్ కెనాల్‌కు స్వస్తి పలుకుతున్నట్లు తెలుస్తోంది. దానికి ప్రత్యామ్నాయంగా ప్రస్తుతం మడకశిరకు కృష్ణా జలాలను తీసుకువస్తున్న హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్ స్థాయిని పెంచడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మడకశిర బ్రాంచ్ కెనాల్ స్థాయిని పెంచినా కృష్ణా జలాలు 120 కిలోమీటర్లు చుట్టేసుకుని మడకశిరకు చేరాల్సిందేనని రైతులు చెబుతున్నారు.

రైతులకు అన్యాయం చేసినట్లే..



హంద్రీనీవా బైపాస్ కెనాల్ నిర్మాణంతోనే మడకశిర ప్రాంతం రైతులకు న్యాయం జరుగుతుంది. లేకపోతే అన్ని విధాలుగా రైతులు నష్టపోవడం ఖాయం. బైపాస్ కెనాల్ నిర్మాణంతో దూరం తగ్గి మడకశిర ప్రాంతానికి సులభంగా కృష్ణా జలాలు చేరుతాయి. అన్ని చెరువులను నింపడానికి అవకాశం ఏర్పడుతుంది.

– ఆనందరంగారెడ్డి, పట్టు రైతుల సంఘం నాయకుడు, మడకశిర

బైపాస్ కెనాల్ నిర్మాణమే మేలు



అగళి మండలానికి ఇంత వరకూ కృష్ణా జలాలు రాలేదు. ఫలితంగా హంద్రీనీవా కాలువలన్నీ నిరుపయోగంగా మారాయి. రూ.వందల కోట్లు వృథా అయ్యాయి. బైపాస్ కెనాల్ నిర్మిస్తే అగళి మండలానికి కూడా కృష్ణా జలాలు ప్రతి ఏడాది వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ప్రభుత్వం బైపాస్ కెనాల్ నిర్మాణాన్ని చేపట్టి రైతులకు సాగునీరు అందించాలి.

– చంద్రప్ప, రైతు, మధూడి, అగళి

జగన్‌కు మంచి పేరు వస్తుందనే..



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ముందు చూపుతోనే మడకశిరకు హంద్రీనీవా బైపాస్ కెనాల్ మంజూరు చేశారు. వెంటనే నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పూర్తిచేయించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం బైపాస్ కెనాల్‌కు స్వస్తి చెప్పి రైతుల నోట్లో మట్టి కొట్టాలని ప్రయత్నాలు చేస్తుండడం అన్యాయం. జగన్ మంచి పేరు వస్తుందనే ఈ దుశ్చర్యకు పాల్పడుతున్నారు. బైపాస్ కెనాల్‌ను రద్దు చేస్తే రైతులు తిరగబడడం ఖాయం.

– ఈరలక్కప్ప, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మడకశిర

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ధర్మవరం అర్బన్: రీఓపెన్ గ్రీవెన్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలోని సమావేశ భవనంలో శుక్రవారం రెవెన్యూ అంశాలు, సాగునీటి సంఘాల ఎన్నికలు, ఓటర్ల జాబితా సవరణ, కోర్టు కేసులు, ఈ ఆఫీస్, గ్రామసభలు తదితర అంశాలపై పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని తెలిపారు. ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లాలో 46 సాగునీటి సంఘాలకు సంబంధించి ఓటర్లు జాబితా తయారీ, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, ప్రచురణ సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ చేసిన అసైన్‌మెంట్ భూముల్లో రీ వెరిఫికేషన్‌ను జిల్లా యంత్రాంగం నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేయాలన్నారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల ప్రజలకు సంబంధించిన సమస్యలు, ఎస్సీ, ఎస్టీ హత్యా నిరోధక చట్టం 1989 మేరకు అందజేసే నష్ట పరిహారాన్ని సకాలంలో అందజేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ మహేష్, తహసీల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష వాయిదా

కదిరి అర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులకు ఈ నెల 10న జరగాల్సిన డీఎస్సీ ఉచిత శిక్షణ ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. ఈమేరకు సహాయ సాంఘిక సంక్షేమాధికారి రెడ్డి బాలాజీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాల్సిందే



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ. చిత్రంలో వైస్ చైర్మన్ వేదాంత నాగరత్నమ్మ, జెడ్పీ సీఈఓ వెంకటసుబ్బయ్య



సమావేశాలకు హాజరైన జెడ్పీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు

- 63 మండలాలనూ 'కరువు' జాబితాలో చేర్చాలి
- స్థాయీసంఘ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: వరుస తుపానుల కారణంగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు పంటలు దారుణంగా దెబ్బతిన్నాయని, నష్టాల్లో కూరుకుపోయిన రైతులను ఆదుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాపరిషత్‌లో చైర్‌పర్సన్ సమక్షంలో స్థాయీ సంఘం–3 (వ్యవసాయం) సమావేశం గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు అధ్యక్షతన జరిగింది. వ్యవసాయ శాఖపై చర్చను ప్రారంభించిన గిరిజమ్మ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 63 మండలాల్లోనూ ఖరీఫ్ పంటలు దెబ్బతింటే ప్రభుత్వం 14 మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా గుర్తించడం అన్యాయమన్నారు. ఉమ్మడి జిల్లా అంతటినీ కరువు జాబితాలో చేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అధికారులకు సూచించారు. నిబంధనలను పక్కనపెట్టి రైతులను ఆదుకోవాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేశ్, నల్లమాడ జెడ్పీటీసీ సభ్యుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

ఉన్నతాధికారుల గైర్హాజరుపై ఆగ్రహం..

స్థాయీ సంఘ సమావేశాలకు, జెడ్పీ సర్వసభ్య సమావేశాలకు కిందిస్థాయి సిబ్బందిని పంపి గైర్హాజరవుతున్న శ్రీసత్యసాయి జిల్లా అధికారులపై సభ్యులు డాక్టర్ గోరంట్ల బాషా, జయరాం నాయక్, శ్రీనివాసులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తరచూ డుమ్మా కొడుతున్న అధికారులపై చర్యలు తీసుకోకపోతే సమావేశాలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్పందిస్తూ గైర్హాజరయ్యే అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఈఓ వెంకటసుబ్బయ్యకు సూచించారు. సోమందేపల్లి హైస్కూల్‌లో టపాసుల అంగళ్ల నిర్వహణకు ఎలా అనుమతి ఇచ్చారని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ డీఈఓ కిష్టప్పను ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.80 కోట్లు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం ప్రభుత్వానికి మంచిది కాదని పేర్కొన్నారు.

టమాట మార్కెట్‌లో ఏమిటీ దోపిడీ?

అనంతపురం శివారులోని కక్కలపల్లి వద్ద టమాట మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి లారీ అసోసియేషన్ పేరిట వాహనాన్ని బట్టి రూ.500 నుంచి రూ.3వేల వరకు వసూలు చేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆరోపించారు. అయితే ఈ డబ్బు పంచాయతీకి గానీ, కార్పొరేషన్‌కు గానీ, మరే ఇతర ప్రభుత్వ శాఖకు పన్ను రూపంలో జమ చేయకుండా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుని మార్కెటింగ్, డీపీఓ, పోలీస్ శాఖలు సమన్వయంతో దోపిడీ సంగతి తేల్చాలని, అవసరమైతే లారీ అసోసియేషన్ వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ప్రభుత్వాదాయాన్ని కాపాడాలని సూచించారు. హిందూపురం మార్కెట్ యార్డులోనూ ఇష్టారాజ్యంగా బ్రోకర్లు ధరలు నిర్ణయించి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని లేపాక్షి జెడ్పీటీసీ శ్రీను ఆరోపించారు.

అంగన్‌వాడీలు ప్రైవేటు ఉద్యోగం చేయొచ్చా?

అనంతపురం అర్బన్ పరిధిలో కొందరు అంగన్‌వాడీ వర్కర్లు తమ విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి ఉద్యోగాల నుంచి తొలగించాలని జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఓ అంగన్‌వాడీ వర్కర్ ఒకరు తన భర్త జిల్లా ముఖ్య అధికారి వద్ద సీసీగా పని చేస్తుండడాన్ని అడ్డుపెట్టుకొని పదేళ్లుగా అంగన్‌వాడీ సెంటర్‌కే వెళ్లడం లేదని ఆరోపించారు. మరికొందరు సీనియర్ అంగన్‌వాడీలు వయసు మీరినా తప్పుడు ధ్రువీకరణతో సర్వీసులోనే కొనసాగుతున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి స్పందిస్తూ.. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'ఉపాధి' 150 రోజులకు పెంచాలి..

ఉపాధి హామీ పథకం ఎంతో మంది ఆకలి తీరుస్తోందని, వంద రోజుల పనిదినాల సంఖ్యను 150కు పెంచాలని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ అధికారులను కోరారు. రోజు కూలి రూ.500కు పెంచాలని డిమాండ్ చేశారు. ఇతర స్థాయీ సంఘ సమావేశాలకు సంబంధించి ఆయా శాఖాధిపతులు తమ శాఖల ప్రగతిని చదివి వినిపించారు. వాటిపై సభ్యులు అనేక అంశాలలను లేవనెత్తి, చర్చించారు.

అన్నీ కుట్రలే..

- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డే టార్గెట్
- ఎల్లో మీడియాతో జతకట్టి అధికారులపై ప్రభుత్వ పెద్దల ఒత్తిడి
- చెరువు ఆక్రమించారంటూ నోటీసులిచ్చిన అధికారులు
- నోటీసులు రద్దు చేసిన హైకోర్టు
- అయినా 'ఈనాడు'లో తప్పుడు కథనాలు



ధర్మవరం మండలం తుంపర్తి వద్ద ఉన్న కేతిరెడ్డి కుటుంబ సభ్యుల ఫాంహౌస్

ధర్మవరం: ప్రజాదరణలో ముందుండే మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం టార్గెట్ చేసింది. చెరువును ఆక్రమించారంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చి నోటీసులిప్పించింది. నిజాలు తెలుసుకోకుండా ఎల్లో మీడియా కథనాలను వండివార్చింది. హైకోర్టు ఆ నోటీసులను రద్దు చేసినా ఈనాడు దినపత్రిక రాసిన రోత రాతలు అందరినీ విస్మయానికి గురిచేస్తున్నాయి.

ఎన్నికలకు ముందు నుంచే కుట్ర..

కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మండల పరిధిలోని తుంపర్తి పొలంలో తన తమ్ముడి భార్య గాలి వసుమతి పేరుతో సర్వే నంబర్ 904, 905, 908 లలో 25.38 ఎకరాల పొలాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశారు. ఈ పొలంలో చీనీ, వక్క తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఎన్నికలకు ముందే కూటమి నాయకులు కేతిరెడ్డికి చెడ్డపేరు తెచ్చేలాగా చేయాలని కుట్ర పన్నారు. అనుకున్నదే తడువుగా చెరువుకు సమీపంలో ఉన్న కేతిరెడ్డి కుటుంబీకులకు చెందిన ఫాంహౌస్‌పై అసత్య ఆరోపణలు చేశారు. చెరువు స్థలం కబ్జా చేశారని ఎల్లో మీడియా ద్వారా విష ప్రచారం చేశారు. వాస్తవంగా అయితే 1932కు ముందే పట్టాలు పొందిన ఒరిజినల్ రైతుల నుంచి కొనుగోలు చేసిన భూములు ఇవి. అయినా నిజాలు తెలుసుకోకుండా ఇష్టారాజ్యంగా ప్రచారం చేశారు.

అధికారులపై ఒత్తిడి..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాయకులు కేతిరెడ్డికి చెందిన ఫాంహౌస్ చెరువు ఆక్రమణలో ఉందని, నోటీసులు ఇవ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సైతం ఎక్కడా కూడా ఆక్రమణలు లేవని, రికార్డులు ఉన్నాయని ఎంత చెప్పినా కూటమి నాయకులు వినలేదు. దీంతో చేసేది లేక ఇరిగేషన్ అధికారులు నోటీసులిచ్చారు.

నోటీసులు రద్దు చేసిన హైకోర్టు..

కూటమి నాయకులు చేస్తున్న కుట్రలను ఎండగట్టాలని కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తన కుటుంబ సభ్యుల ద్వారా 20 రోజుల క్రితం డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ సూట్‌ను వేశారు. ఫాంహౌస్‌కు భూముల ఆధారాలను కోర్టుకు సమర్పించారు. ఆధారాలను స్వీకరించిన న్యాయస్థానం కోర్టు కమిషనర్‌ను నియమించి విచారణ చేపట్టింది. సూట్ ప్రకారం కోర్టుకు సమాచారం ఇవ్వకుండా నిబంధనలు అతిక్రమించకుండా అధికారులు చట్టానికి లోబడి ఉండాల్సి ఉంటుంది. అయితే ఇవేవి పట్టించుకోకుండా ఇరిగేషన్ అధికారులు కేతిరెడ్డి మరదలు గాలి వసుమతి పేరిట చెరువు స్థలం ఆక్రమించారని ఆరోపిస్తూ ఈనెల 6న నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోపు ఫాంహౌస్ ఖాళీ చేయాలని అందులో పేర్కొన్నారు. నోటీసులిచ్చిన రోజునే కేతిరెడ్డి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఆధారాలను సమర్పించినా ఇరిగేషన్ అధికారులు ఏ విధంగా నిబంధనలు అతిక్రమించి కోర్టుకు తెలుపకుండా నోటీసులు ఇచ్చారో నివేదించారు. విచారించిన న్యాయస్థానం ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసులను ఈనెల 7వ తేదీనే రద్దు చేస్తూ (సెట్ అసైడ్) ఉత్తర్వులను ఇచ్చింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసు పూర్తిగా రద్దయింది.

పక్కరైతు భూమిని కూడా...

కేతిరెడ్డి కుటుంబ సభ్యుల ఫాంహౌస్‌కు ఆనుకుని సర్వే నంబర్ 43-2, 43-2ఎ, 43-2బీలో ఉన్న భూమిని కేతిరెడ్డికే ఆపాదించారు. సదరు భూమికి సంబంధించిన యజమాని అయిన రైతు జే.సూర్యనారాయణ 2018లో టీడీపీ హయాంలో ఇచ్చిన జీఓ నంబర్ 575 ప్రకారం డాటెడ్ ల్యాండ్ నుంచి ఎన్‌ఓసీ తెచ్చుకుని అప్పటి కలెక్టర్ నాగలక్ష్మి ఆమోదంతో రెగ్యులరైజ్ చేసుకున్నారు. దీన్ని కూడా ఆక్రమణ అంటూ అధికారులు కేతిరెడ్డికి అంటగట్టే ప్రయత్నం చేసి నోటీసులిచ్చి రైతును కూడా ఇబ్బంది పెడుతున్నారు.

అవాస్తవాలతో ఈనాడు కథనం

ఈనెల 7వ తేదీన ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీసును రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన సెట్ సైడ్ ఉత్తర్వులను పట్టించుకోకుండా కేవలం కేతిరెడ్డి కుటుంబంపై బురద జల్లాలన్న లక్ష్యంతో ఈనాడు దినపత్రిక శుక్రవారం అసత్య కథనాన్ని ప్రచురించింది. రద్దయిన నోటీసునే హైలైట్ చేస్తూ అవాస్తవాలను ప్రచురించింది. వాస్తవంగా అయితే ఈనాడులో రాసినట్లుగా ట్యాంక్ బెడ్ ఉన్నది సర్వే నంబర్ 661 వరకు మాత్రమే. కేతిరెడ్డి ఫాంహౌస్ స్థలం సర్వే నంబర్లు 905, 906, 904, 908లలో మాత్రమే ఉంది. కనీస పరిజ్ఞానం లేకుండా ఎల్లో మీడియా కూటమి నాయకులు చెప్పినట్లుగా వార్త రాయడం ప్రజల్లో పత్రికా వ్యవస్థ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది.

శిక్ష పడేలా చేస్తా



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నన్ను ఇబ్బంది పెట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వ పెద్దలు అధికారులపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. ఎలాగైనా నాపై బురదజల్లి రాక్షసానందం పొందాలని చూస్తున్నారు. అయితే చట్ట పరిధిలోనే వారికి శిక్ష పడేలాగా చేస్తా. తుంపర్తి వద్ద నా కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఫాంహౌస్‌లో చెరువు స్థలం ఒక్క సెంటు కూడా ఆక్రమణకు గురికాలేదు. గతంలోనే అధికారులు విచారణ జరిపి క్లీన్ చిట్ ఇచ్చారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకుండా నోటీస్‌లు ఇస్తున్నారు. నా ఫాంహౌస్ పేరిట ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన నోటీస్‌ను హైకోర్టు రద్దు చేసినా ఎల్లో మీడియా అసత్య కథనాలతో బురదజల్లాలని చూస్తోంది. నిబంధనలను ఉల్లంఘించిన అధికారులపై కోర్టులో శిక్షపడేలాగా చేస్తా.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, ధర్మవరం

క్లుప్తంగా

దాడి కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: వ్యక్తిపై దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను శుక్రవారం ఆయన వెల్లడించారు. ఈ నెల 3వ తేదీ కదిరిలోని అయ్యప్ప స్వామి గుడి వెనుక వీధిలో నివాసముంటున్న బాల మురళీకృష్ణ టపాసులు కాలుస్తుండగా అదే ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ వారించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. క్షణికావేశానికి లోనైన బాలమురళీకృష్ణ చేతికి అందిన ఇటుక పెళ్లతో హరిప్రసాద్‌పై దాడి చేశాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన హరిప్రసాద్‌ను స్థానికులు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం బాలమురళీకృష్ణను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

శారదానగర్‌లో పర్యటించిన వైద్యాధికారి



స్థానికులతో మాట్లాడుతున్న జిల్లా సహాయ మలేరియా అధికారి లక్ష్మినాయక్

ధర్మవరం అర్బన్: స్థానిక శారదానగర్‌లో డెంగీ కేసు నమోదు కావడంతో జిల్లా సహాయ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ శుక్రవారం ఆ ప్రాంతంలో పర్యటించి విచారణ చేశారు. శారదానగర్‌కు చెందిన 9 ఏళ్ల వయసున్న జితేంద్ర డెంగీ బారిన పడ్డాడు. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో పర్యటించిన వైద్యాధికారులు వార్డులోని కాలువలను శుభ్రం చేయించారు. ప్రతి ఇంటా జ్వర పరీక్షలు చేపట్టారు. అనంతరం కీటక జనిత వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు జయరాం నాయక్, గోపీనాయక్, వెంకటేష్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చోరీ కేసులో నలుగురి అరెస్ట్

కదిరి టౌన్: స్థానిక అడపాల వీధిలో నివాసముంటున్న వి.నారాయణస్వామి ఇంట్లో చోరీకి పాల్పడిన నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను పట్టణ పీఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. నారాయణస్వామి ఇంటి పైపోర్షన్‌ను ఇటీవల ఇద్దరు అద్దెకు తీసుకున్నారు. గత నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో సదరు వ్యక్తులు లోపలకు చొరబడి రూ.3.50 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఘటనపై అదే రోజు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సాయంత్రం హిందూపురానికి వెళ్లే మార్గంలో ఉన్న గట్టు వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న కర్ణాటకకు చెందిన సన్మాన్‌ఖాన్, మక్బూల్‌అహమ్మద్, ఎస్.ఫరూక్ అబ్దుల్లా, తోకల శ్రీకాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో నారాయణస్వామి ఇంట్లో చోరీ చేసినట్లుగా అంగీకరించారు. నిందితుల నుంచి రూ.2.20 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఈ తీర్పే ఫైనల్

- న్యాయ పరిష్కారంలో వాది, ప్రతివాది ఇద్దరూ విజేతలే
- సుప్రీం కోర్టు తీర్పుతో సమానంగా జాతీయ లోక్‌అదాలత్ సేవలు
- డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్



ఉమ్మడి అనంతపురం జిల్లా న్యాయస్థానం

అనంతపురం: యువ దంపతుల మధ్య గొడవలు నెల కొన్నప్పుడు ఇరువైపులా పెద్దలు సమావేశమై వారికి నచ్చజెప్పి రాజీ కుదర్చడం చూస్తుంటాం. ఈ విధానం చాలా సందర్భాల్లో సమస్యని కోర్టు వరకు వెళ్లకుండా సామరస్యంగా సమిసిపోయేలా చేస్తుంది. ఈ పద్ధతినే అన్ని రకాల వివాదాలకూ వర్తింపజేస్తే బాగుంటుందన్న ఆలోచన నుంచి 'మధ్యవర్తిత్వం' విధానం వచ్చింది. ఈ అంశానికి తగిన ప్రాధాన్యతనివ్వడం ద్వారా న్యాయస్థానాల మీద కేసుల భారాన్ని తగ్గించవచ్చని లోక్ అదాలత్‌లు నిరూపించాయి. ప్రతి సమస్యను కోర్టు ముంగిటకు తీసుకెళ్లకుండా మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకుంటే సమయంతో పాటు డబ్బూ ఆదా అవుతుందని న్యాయ నిపుణులు అంటున్నారు.

వివాదాలతో చిక్కులు ఇలా...

- జిల్లా కేంద్రంలోని ఇద్దరు మిత్రులు ఉమ్మడి పెట్టుబడితో ఓ వ్యాపారాన్ని ప్రారంభించారు. వ్యాపారం బాగా జరుగుతూ ఆర్థికంగా బలపడిన సమయంలో ఇద్దరి మనస్పర్థలు చోటు చేసుకున్నాయి. లెక్కల్ని తారుమారు చేసి చూపుతున్నాడనే అపనమ్మకం ఇద్దరిలోనూ బలపడి విడివిడిగా కోర్టులో కేసులు వేశారు. ఈ క్రమంలో ఎవరికి వారు కేసు గెలవాలని పంతానికి పోయారు. ఫలితం... బాగా జరుగుతున్న వ్యాపారం కాస్త మూతపడింది.
- జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు పక్కపక్కనే పొలాలు ఉన్నాయి. ఈ క్రమంలో పంటకు కాలువ నీరు పెట్టే విషయంలో ఇద్దరి మధ్య గొడవ చోటు చేసుకుని కొట్టుకునే స్థాయికి వెళ్లింది. ఎవరికి వారు బంధుజనాన్ని పోగేసుకుని కిందామీద పడి కొట్టుకున్నారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగాయి. దీంతో పోలీసు కేసు నమోదై, ఏళ్ల తరబడి కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తోంది.

.... ఎవరికి వారు కేసు గెలవాలన్న పంతానికి పోవడంతో ఎన్నో రకాల వివాదాలు న్యాయస్థానాల్లో అపరిష్కృతంగానే ఉన్నాయి. ఫలితంగా ఆయా కేసులకు సంబంధించి కోర్టు ఖర్చులు, లాయరు ఫీజులు ఇతరత్రా అన్ని కలిపి కక్షిదారులపై భారం తడిసి మోపడవుతోంది. ఇలాంటి తరుణంలో జాతీయ లోక్ అదాలత్ మధ్యేమార్గంగా తీర్పులు వెలువరిస్తుంది.

'సుప్రీం' తీర్పుతో సమానం..

సమస్యను సామర్యసంగా అర్థం చేసుకుంటే ఎంత పెద్ద వివాదాన్నైనా సులువుగా పరిష్కరించుకోవచ్చునని జాతీయ లోక్ అదాలత్‌లు నిరూపించాయి. కక్షిదారులను ఏకం చేసి, ప్రశాంత జీవనం గడిపేలా చేయడమే జాతీయ లోక్‌అదాలత్ న్యాయవాదుల ముఖ్య ఉద్దేశ్యం. అన్ని రకాల కోర్టులలో పెండింగ్‌లో ఉన్న మోటార్ వాహనాల ప్రమాద కేసులు, సివిల్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగిన క్రిమినల్ కేసులు, ప్రిలిటిగేషన్ కేసులకు చక్కటి పరిష్కారాన్ని జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు చూపుతున్నారు. సాధారణ కోర్టులో వెలువడిన తీర్పు వెలువడితే ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే వీలుంది. అయితే జాతీయ లోక్ అదాలత్ ఇచ్చిన తీర్పులు సుప్రీం కోర్టు తీర్పులతో సమానం... అదే అంతిమం కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కేసులను పరిష్కారం చేసుకోవాలనుకునే కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ ఓ వరంగా మారింది.

ఇరువురూ విజేతలే..

సాధారణంగా కోర్టు వివాదాల్లో చిక్కుకున్న కక్షిదారులు ఇద్దరిలో అంతిమంగా ఒక్కరినే విజయం వరిస్తుంది. అయితే జాతీయ లోక్ అదాలత్ వెలువరించి తీర్పులో ఇద్దరూ విజేతలుగానే నిలుస్తున్నారు. సివిల్ కేసుల్లో జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కారం దక్కితే అప్పటి వరకూ వారు చెల్లించిన కోర్టు ఫీజులు సైతం వెనక్కి చెల్లిస్తారు. బ్యాంకులో రుణం తీసుకుని కట్టకుండా ఏళ్ల తరబడి ఉన్న కేసులను సైతం ఒన్ టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 13 ప్రాంతాల్లోని 26 బెంచుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణకు రంగం సిద్ధమైంది. అనంతపురం జిల్లా కోర్టు ప్రాంగణంలోని అన్ని కోర్టులతో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని అన్ని కోర్టుల్లోనూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నారు. ఒకే రోజు 5 వేల కేసులకు పరిష్కారం చూపే దిశగా న్యాయమూర్తులు కసరత్తు చేపట్టారు. అన్ని విభాగాల అధికారులనున సమన్వయం చేసుకుని లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేలా కృషి చేస్తున్నారు.

జాతీయ లోక్‌అదాలత్ మంచి వేదిక



న్యాయ పరిష్కారం కోరుకుంటున్న కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ మంచి వేదిక. రాజీ చేయదగిన కేసులన్నింటినీ పరిష్కరించేందుకు ఇదొక మంచి అవకాశం. ఈ తీర్పులకు తిరుగు లేదు. కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుంది. సివిల్ కేసుల్లో న్యాయపరిష్కారం పొందితే కోర్టు ఫీజులు సైతం వెనక్కి చెల్లిస్తాం. డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌కు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 ప్రాంతాల్లో 26 బెంచ్‌లు ఏర్పాటు చేశాం. ఈ అంశంపై ఇప్పటికే ఆయా పరిధిలోని జడ్జిలతో సమీక్షించాం. గత లోక్‌అదాలత్‌లో ఏకంగా 6 వేల కేసులకు పరిష్కారం దక్కింది. తాజా మరో 5 వేల కేసులను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాం.

– జి. శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి

బావిలో దిగి రైతు కూలీ మృతి



బావి వద్ద గుమికూడిన గ్రామస్తులు

ధర్మవరం రూరల్: మోటారు మరమ్మతు కోసం బావిలో దిగిన ఓ రైతు కూలీ నీట ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతదేహం కోసం పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలిస్తున్నారు. వివరాలు.... ధర్మవరం మండలం కట్టకిందపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని వ్యవసాయ బావిలో మోటారు మరమ్మతుకు గురైంది. మోటారును వెలికి తీసేందుకు శుక్రవారం ఉదయం 9.30 గంటలకు కనగానపల్లి మండలం ముక్తాపురం గ్రామానికి చెందిన దాసరి రామాంజినేయులు (43)తో పాటు మరో వ్యక్తి వెళ్లారు. పుష్కలంగా నీళ్లు ఉన్న బావి అడుగున ఉన్న మోటార్‌కు తాడు కట్టి పైకి లాగాలని భావించారు. ఈ క్రమంలో రామాంజనేయులు బావిలో దిగి నీటిలో ఉన్న మోటార్ వద్దకు ఈదుకుంటూ వెళ్లాడు. అయితే బావిలో ముళ్ల పొదల్లో చిక్కుకున్న ఆయన బయటకు రాలేక ఊపిరాడక బావిలోనే మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బావిలో నీటిని తోడే ప్రయత్నం చేపట్టారు. బావి ఉపరితలంలో ఉన్న చెరువు నుంచి నీరు ఊరుతుండడంతో నీరు ఎంతకూ తగ్గడం లేదు. సాయంత్రం వరకూ ఫైర్ ఇంజన్ సాయంతో నీటిని తోడినా మృతుడి ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆర్డీఓ మహేష్, బీజేపీ నాయకులు అక్కడకు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కల్వర్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేట సమీపంలో ఉన్న పీతురుకుంట కల్వర్టులో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రూరల్ సీఐ నాగేంద్ర, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి చేతిపై తెలుగులో అంజి, ఇంగ్లిష్‌లో ఉమ అనే పచ్చబొట్టు ఉంది. ముఖం కనిపించకుండా నుజ్జు నుజ్జు అయి ఉండడంతో హత్య చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనా స్థలాన్ని డీఎస్పీ శివనారాయణస్వామి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తి హత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జీఓ 143ని తక్షణమే రద్దు చేయాలి

- మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి



మాట్లాడుతున్న బత్తుల కోదండరామిరెడ్డి

ఉరవకొండ: వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు నరకప్రాయమైన జీఓ 143ని తక్షణమే రద్దు చేయాలని కూటమి సర్కార్‌ను మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో దాదాపు 50 మంది ఉద్యోగులు ఏళ్ల తరబడి జిల్లా కేంద్రంలోనే తిష్ట వేసుకున్నారని, అలాంటి వారిని గుర్తించి గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వివిధ హోదాల్లోని ఉద్యోగుల్లో చాలా మంది వివిధ కారణాలతో మృతి చెందారని, దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించిన వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబానికి ప్రభుత్వం కేవలం రూ.2 లక్షలు చెల్లించి చేతులు దులుపుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని చనిపోయిన తర్వాత ఆ కుటుంబం రోడ్డున పడుతుందనే విషయాన్ని ప్రభుత్వ పెద్దలు విస్మరించడం బాధాకరమన్నారు. మృతి చెందిన ఉద్యోగి కుటుంబసభ్యులకు రూ.20 లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

జూదరుల అరెస్ట్



జూదరులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుడిబండ: మండలంలోని ఆచారిపాళ్యం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఉదయం మడకశిర రూరల్ సీఐ రాజకుమార్, సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న వారు పోలీసులను గమనించి పారిపోయారు. వీరిలో ఆరుగురిని పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన ఐదుగురు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.52,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- నల్లచెరువు: మండలంలోని నడింపల్లి వద్ద జూదం ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు నల్లచెరువు ఎస్‌ఐ మక్బూల్‌బాషా తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం నడింపల్లి శివారు ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.6,180 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

పురం చైర్మన్ ఎన్నికకు నేడు నోటిఫికేషన్?

- ఇప్పటికే హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో కౌన్సిలర్లు
- గోడదూకిన కౌన్సిలర్లకు సకల మర్యాదలు చేస్తున్న టీడీపీ నేతలు
- శనివారం బాలకృష్ణతో సమావేశం... వెనువెంటనే నోటిఫికేషన్‌కు చర్యలు
- సోమవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించేలా ప్రణాళిక



హిందూపురం: పార్టీ ఫిరాయింపులు... క్యాంపు రాజకీయాలతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన హిందూపురం మునిసిపల్ చైర్మన్ ఎన్నిక చివరి అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ నెల 11న మునిసిపల్ చైర్మన్ ఎన్నిక నిర్వహించేలా శనివారమే నోటిఫికేషన్ జారీకి టీడీపీ నాయకులు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం.

చైర్మన్ గిరి కోసం రిసార్ట్ రాజకీయం..

38 వార్డులున్న హిందూపురం మునిసిపాలిటీలో గత ఎన్నికల్లో టీడీపీ తరఫున ఆరుగురు, బీజేపీ తరఫున ఒకరు, ఎంఐఎం తరఫున ఒక కౌన్సిలర్ ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలోనే మకాం వేసి వార్డులన్నీ తిరిగినా జనం పెద్దగా పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే వైఎస్సార్‌సీపీ ఏకంగా 30 స్థానాల్లో అఖండ విజయం సాధించింది. అయితే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం మునిపల్ చైర్మన్ పీఠంపై కన్నేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసి టీడీపీవైపు తిప్పుకున్నారు. లొంగని వారిని బెదించారు. మొత్తానికి పలువురు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు బలవంతంగా పచ్చకండువాలు కప్పి వారం దరినీ కుటుంబాలతో సహా మూడు రోజుల క్రితం హైదరాబాద్‌కు తరలించి క్యాంపు రాజకీయాలకు తెరతీశారు. అక్కడ వారు చేజారిపోకుండా వారి సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకుని రాచమర్యాదలు చేస్తున్నారు.

నేడు బాలకృష్ణతో భేటీ..

హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో ఉన్న కౌన్సిలర్లు శుక్రవారం ఓల్డ్ సిటీలో షాపింగ్ చేశారు. పలువురు ముస్లిం కౌన్సిలర్లు చార్మినార్ సమీపంలోని మసీద్‌లో ప్రార్థనలు చేశారు. వీరంతా శనివారం ఎమ్మెల్యే బాలకృష్ణను కలిసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎమ్మెల్యే బాలకృష్ణ ఓకే అంటే శనివారమే నోటిఫికేషన్ ఇచ్చి సోమవారం చైర్మన్ ఎన్నిక నిర్వహించేలా ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. హైదరాబాద్‌లోని రిసార్ట్‌లో ఉన్న కౌన్సిలర్లంతా నేరుగా చైర్మన్ ఎన్నిక రోజు కౌన్సిల్‌కు చేరుకునేలా రంగం సిద్ధం చేశారు. ఆరుగురు కౌన్సిలర్లున్న టీడీపీ.... చైర్మన్ పీఠం కోసం చేస్తున్న అప్రజాస్వామ్య చర్యలపై హిందూపురం వాసులు పెదవి విరుస్తున్నారు. కొన్ని వార్డుల్లోని వారైతే పార్టీ ఫిరాయింపుదారులకు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

'పురం'లో మాయమవుతున్న పిల్లులు

- కొన్ని రోజులుగా కనిపించకుండా పోతున్న పెంపుడు పిల్లులు
- అయోమయంలో మేళాపురం వాసులు
- పిల్లులను పట్టుకెళ్లి చంపి తింటున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు
- సంచార జాతుల వారిని కట్టడి చేయాలంటూ వినతి



సీఐ రాజగోపాలనాయుడుకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని మేళాపురంలో గత కొన్ని రోజులుగా పెంపుడు పిల్లులు మాయమవుతున్నాయి. తొలుత ఒకరిద్దరి ఇళ్లలో పిల్లులు మాయమైనా... ఆ తర్వాత వరుసగా ఇలాంటి ఘటనలే వెలుగు చూస్తుండడంతో స్థానికుల్లో ఆందోళన మొదలైంది. దీంతో మేళాపురం పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ క్రమంలో మేళాపురం సర్కిల్‌లోని భారతీనగర్ చెరువు కట్ట వద్ద గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్న సంచార జాతుల వారిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. రోజూ దేవుడి ప్రతిమను నెత్తిన పెట్టుకుని కాలనీల్లో సంచరిస్తూ డబ్బు, బియ్యం, బ్యాళ్లు సేకరించుకునే వీరు... ఇళ్ల వద్ద గమనిస్తూ ఎవరూ లేని సమయంలో పెంపుడు పిల్లుల మెడకు ఉచ్చు వేసి తీసుకెళుతున్నారని, అనంతరం వాటిని చంపి తింటున్నారంటూ శుక్రవారం ఉదయం వన్‌టౌన్ సీఐ రాజగోపాలనాయుడుకు ఫిర్యాదు చేశారు. సంచార జాతుల వారిని కట్టడి చేయాలని విన్నవించారు. దీనిపై విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శనరావు, తదితరులు

అనంతపురం: జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న ఎస్.వెంకటేష్‌నాయక్, ఓటీపీఆర్ఐలో ఎమ్మెస్సీ ఫుడ్‌టెక్నాలజీ చదువుతున్న జి. నందిత న్యూఢిల్లీలో జరిగే ప్రీ రిపబ్లిక్ డే పరేడ్ శిబిరానికి ఎంపికయ్యారు. జలగావ్‌లోని కవయిత్రి బహినాబాయి చౌదరి నార్త్ మహారాష్ట్ర యూనివర్సిటీ వేదికగా ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు జరిగే క్యాంప్‌లో వీరు ప్రత్యేక శిక్షణ పొందనున్నారు. ఎంపికైన విద్యార్థులను జేఎన్‌టీయూఏ ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద అభినందించారు.

దొంగలను పట్టుకున్న రైతులు



రైతులకు పట్టుబడిన దొంగలు

బత్తలపల్లి: పంట పొలాల్లో రైతులు అమర్చుకున్న బిందు, తుంపర సేద్యం పరికరాలను అపహరించుకెళుతున్న ఇద్దరిని రైతులు బంధించి పోలీసులకు అప్పగించారు. వివరాలు... బత్తలపల్లిలోని జగనన్న లేఅవుట్ కాలనీ సమీపంలో ఓ రైతు గురువారం తన పొలానికి నీరు పెట్టి సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత పొలానికి బయలుదేరిన ఆయన మార్గ మధ్యంలో కేబుల్ వైర్లను కాలుస్తున్న ముగ్గురు అపరిచితులను గుర్తించి వారి పక్కన చేరి మౌనంగా పరిశీలించాడు. ఆ చుట్టుపక్కల కత్తిరించి పడేసిన కేబుల్‌ను గమనించి ఆగంతకులు గమనించకుండా తన కుమారుడికి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న గ్రామంలోని రైతులు మూకుమ్మడిగా అక్కడకు చేరుకుంటుండగా గమనించిన దుండగులు అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో రైతులు వెంటాడి ఇద్దరిని పట్టుకున్నారు. మరొకడు తప్పించుకున్నాడు. పట్టుబడిన ఇద్దరికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. విచారణలో ఒకరు కంబదూరు నివాసి కాగా, మరొకరు వేంపల్లి వాసిగా పోలీసులు గుర్తించారు. బత్తలపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద గుడారాలు వేసుకుని పగలు వ్యాపారాలు చేసుకుంటూ, రాత్రి దొంగతనాలకు పాల్పడుతున్నట్లుగా నిర్ధారణ అయింది. నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేస్తున్నారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

పుట్టపర్తి టౌన్: ఆత్మహత్యాయత్నం చేయబోయిన వృద్ధురాలిని పోలీసులు సకాలంలో గుర్తించి కాపాడారు. వివరాలు... రొద్దం మండలం పద్ద కోడిపల్లికి చెందిన బోయ గంగమ్మ కుటుంబకలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి పెంచుకుని రెండు రోజుల క్రితం ఇల్లు విడిచి వెళ్లింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం కొత్తచెరువు సమీపంలోని నాగులకనుమ వద్ద బుక్కపట్నం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన ఆమెను స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కానిస్టేబుళ్లు భాస్కర్, మారుతి అక్కడకు చేరుకుని ఆమెను కాపాడి, పీఎస్‌కు పిలుచుకెళ్లారు. కుటుంబసభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వృద్ధురాలిని జాగ్రత్తగా చూసుకోవాలని అప్పగించారు.

ప్రమాదంలో పలువురికి గాయాలు

బత్తలపల్లి: ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్న ఘటనలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన నాగభూషణ శుక్రవారం బెంగుళూరు నుంచి విచ్చేసిన తన కుమార్తె తనుశ్రీని తీసుకుని ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. బత్తలపల్లి వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా వేగంగా ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన ధర్మవరం మండలం నాగలూరు గ్రామానికి చెందిన సోము ఢీకొన్నాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు వెంటనే ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు.

పోకిరీ వేధింపులపై ఎంఈఓ విచారణ



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

ధర్మవరం అర్బన్: స్థానిక ఇందిరమ్మ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉదయం ఓ పోకిరీ చొరబడి ఇద్దరు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఘటనపై శుక్రవారం ఉదయం ఆ పాఠశాలకు ఎంఈఓ గోపాల్‌నాయక్ చేరుకుని విచారణ చేపట్టారు. విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో ఆయన సమావేశమై మాట్లాడారు. పాఠశాల ప్రహరీకున్న రెండు గేట్లలో ఓ గేటును మూసివేయాలని నిర్ణయించారు. పాఠశాలలో ఆకతాయిలు చొరబడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎంఈఓను సీఐటీయూ నాయకులు కలసి వినతి పత్రం అందజేశారు.

అంతర్ కళాశాలల పురుషుల క్రీడాపోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక శంకరనందాగిరి స్వామి డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల అంతర్ కళాశాలల పురుషుల క్రీడాపోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ రిజిస్టర్ డాక్టర్ రమేష్‌బాబు, స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ బి.జెస్సీ, కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, కళాశాల చైర్మన్ మురళి, తదితరులు హాజరయ్యారు. విద్యార్థుల్లో పోటీ తత్వంతో పాటు స్నేహభావాన్ని పెంపొందించేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. చదువులతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వ్యాయామ ఉపాధ్యాయుడు బాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్ తదితర విభాగాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.